**పరిశీలనా శక్తి పెంచుకోవాలి –నారంశెట్టి ఉమామహేశ్వరరావు**

ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు/
చూడచూడ రుచుల జాడ వేరు/
పురుషులందు పుణ్య పురుషులు వేరయా/
విశ్వదాభిరామ! వినుర వేమ!/ అన్నారు కవి వేమన.

ఉప్పు, కర్పూరం రెండు వేరు వేరు పదార్ధాలయినప్పటికీ చూడడానికి ఒకే విధంగా కనిపిస్తాయి. వాటి రుచులు, గుణాలు మాత్రం విభిన్నంగా ఉంటాయి. వాటిని రుచి లేదా వాసన చూసినప్పుడే అసలు గుణాలు తెలుస్తాయి. అలాగే లోకంలోని మనుషులందరూ ఒకే విధంగా అవయవ లక్షణాలు, ఆకారాలు కలిగి ఉంటారు. గొప్పవారిని తెలుసుకోవాలంటే మనుషుల్ని బాగా పరిశీలించాలి. అప్పుడే వాళ్ళలో ఉన్న తేడాలు తెలుసుకోవడం సాధ్యపడుతుంది. వారి లక్షణాలను పరిశీలించినప్పుడు మాత్రమే ఒక్కొక్కరిలో ఒక్కో లక్షణం ప్రత్యేకంగా ఉంటుందని, అలాంటి వాళ్లలో కొందరే గొప్పవాళ్ళని గుర్తించగలుగుతామని భావం.

**ఉప్పూ కర్పూరాల విషయమే అయినా, మనుషుల్లో గొప్పవారిని కనిపెట్టే విషయంలోనైనా జాగ్రత్తగా పరిశీలించినప్పుడు మాత్రమే అసలైన స్వభావం, లక్షణాలు తెలుస్తాయి.**

**పిల్లలూ! మీకు ఇప్పటికే బోధపడి ఉంటుంది. ఈ నెల మనం తెలుసుకోబోతున్న అంశం ‘పరిశీలనా శక్తి పెంచుకోవడం’ అని .**

అందమైన హంస అపురూపమౌ పక్షి /
నీరు పాల నదియు వేరు చేయు /
విషయ సంచయములు విరివిగా నున్నను /
ఏరు మంచి నటులే ఎరుక మీర. /

గ్రద్ద వలెను చూచి గ్రహించు విషయమ్ము /
ఉర్వి తీక్ష్ణ దృష్టి ఉపకరించు /
సూక్ష్మ బుద్ధితోడ సూదంటు రాయిలా/
మంచినే గ్రహించి మహిని చెలగు. /

అని సినీ గీత రచయిత తుంబలి శివాజీ గారన్నట్టు ఏదైనా కొత్త విషయం నేర్చుకోవడానికి, అర్థం చేసుకోవడానికి పునాది లాంటిది పరిశీలనా శక్తి .

పాలూ నీళ్లను హంస వేరు చేసినట్టు , ఆకాశంలో ఎగిరే గ్రద్ద, నిశిత పరిశీలనా దృష్టితో భూమి మీద లేక నీటిలో ఉండే ఆహారాన్ని పసిగట్టినట్టు మనుషులు కూడా తమ పరిశీలనా శక్తిని లోతుగా అలవరచుకోవాలని భావం. అప్పుడే విషయ గ్రహణ శక్తి పెరుగుతుంది.

ప్రపంచాన్ని గమనించడం, ప్రశ్నలు వేయడం, విషయాల్ని లోతుగా అర్థం చేసుకోవడం మొదలైన వాటికి పరిశీలనా శక్తి అవసరం. ముఖ్యంగా విద్యార్థులు పరిశీలనా శక్తి అలవర్చుకోవాలి. అప్పుడే తరగతి పుస్తకాలకు పరిమితం కాకుండా అదనపు జ్ఞానాన్ని పెంచుకుంటూ చురుకైన ప్రదర్శనతో, మెరుగైన ఆలోచనలతో, ఆకట్టుకునే నైపుణ్యంతో ఉన్నత స్థాయికి చేరడానికి ఉపయోగపడుతుంది.

చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పిల్లలు గమనించినట్లయితే అనేక విషయాలు కనబడతాయి. ఆకాశంలో ఎగిరే పక్షులు, ఇంటి ముందు క్రమశిక్షణతో కవాతు చేసే సైనికుల్లాంటి చీమల బారులు, దొడ్లో మేత మేస్తున్న పశువులు, ఇంటి ముందున్న చెట్టు మీదకు గబగబా ప్రాకే ఉడుతలు, జామ చెట్టు మీద వాలే చిలుకలు, పెరటి గోడ మీద కూర్చుని ఐకమత్యంతో ఆహారం తింటున్న కాకులు....ఇలాంటివి ఎన్నో కనబడతాయి. ప్రతి ప్రాణికి ఒక్కో తరహా జీవన విధానం ఉంటుంది. అలవాట్లు ఉంటాయి. వాటిని పరిశీలించినట్లయితే మదిలో ఏవో కొత్త ఊహలు పుడతాయి. మరెన్నో అద్భుత విషయాలను కనిపెట్టేందుకు ఉపయోగపడతాయి.

అంతేకాదు . మనం పంచేంద్రియాలతో (కళ్ళు, ముక్కు, చెవులు, నాలుక, చర్మం) దర్శించే లేదా స్పర్శించే ప్రతి విషయాన్ని శ్రద్ధగా గమనించాలి. చూడటమే కాకుండా వాటి గురించి ఆలోచించాలి. “ఇదేమిటి? దేనితో తయారయింది? ఎందుకిలా ఉంది? అదెలా పనిచేస్తుంది? ఇంకేం తెలుసుకోవాలి?ఇంకెలా పని చేస్తే మరింత మెరుగైన ఫలితాలు పొందవచ్చుననే” ప్రశ్నలు వేసుకోవడమే పరిశీలన. అప్పుడే కొత్త ఆలోచనలు ఉద్భవిస్తాయి. నూతన ఆవిష్కరణలకు తోడ్పడతాయి.

చుట్టు వనరుల స్థితిగతుల్ చూడ వలయు/
నిశిత పరిశీలనాదృష్టి నేర్వగలరు/
రాళ్ళలోగల విలువైన రత్నరాశి /
పొందగల్గుదురందరికందగల్గు /

అని కవి దానా గారన్నట్టు పరిశీలనా శక్తి మనుషులకు ఉపయోగపడుతుంది. చక్కగా వినియోగించుకోవాలి కానీ అదొక వరం. ఎన్నో విలువైన రత్నాల్లాంటి కొత్త విషయాలను నేర్పిస్తుంది.

బాగా విస్తరించి ఉన్న చెట్టుని చూసినప్పుడు , ఆ చెట్టు ఆకులు పచ్చగా ఎందుకున్నాయో , ఎండలో అవెలా పెరుగుతాయో , చెట్టు యొక్క వేర్లు భూమిలో ఏం చేస్తాయో వంటి ప్రశ్నలు మనసులో మెదలాలి. అప్పుడే చెట్ల గురించి అనేక విషయాలు తెలుసుకునే అవకాశం కలుగుతుంది. అలా మనసులో కలిగిన ఒక ఆలోచన మరెన్నో విషయాలు తెలుసుకునేందుకు సహాయపడుతుంది.

చుట్టూ ఉన్న ప్రపంచాన్ని బాగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది పరిశీలనా శక్తి. తెలిసిన విషయాలనే మరింత లోతుగా తెలుసుకోవడానికి , తెలివైన నిర్ణయాలు తీసుకోవడానికి ఉపయోగపడుతుంది. పాఠశాల చదువులో కూడా తెలివిగా ఎదగడానికి, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు పొందడానికి ఉపయోగపడుతుంది. తరగతి పాఠాలను, చిత్రాలను, పటాలను బాగా పరిశీలిస్తే, అనేక విషయాలు సులువుగా అర్థం చేసుకోగలుగుతారు.

పరిశీలనా శక్తిని ఎలా పెంచుకోవాలన్న సందేహం కలగడం సహజం. పరిశీలనా శక్తిని పెంచుకోవడం సులభమే . ప్రతిరోజూ కొన్ని నిమిషాలు కేటాయించి చుట్టూ ఉన్న విషయాల్ని గమనించాలి.

అనుభవము లేని విభవము లనుభావ్యయ కానియాలు నార్యానుమతిన్/

గనని స్వభావము ధర్మముఁ గొనని సిరియు వ్యర్థమెన్న గువ్వలచెన్నా! /

అని చెప్పారు గువ్వల చెన్న శతక కర్త. అనగా అనుభవం లేని సంపద, ఇతరులకు ఉపయోగపడని సంపద, పెద్దల అనుమతి లేని స్వభావం, ధర్మాన్ని పాటించని సంపద వ్యర్థమని భావం. అంటే అనుభవం లేకుండా సంపాదించిన సంపద ఉపయోగం లేకుండా పోతుంది. ఇతరులకు ఉపయోగపడని సంపద వ్యర్థం. పెద్దల అనుమతి లేకుండా నడుచుకునే స్వభావం మంచిది కాదు. ధర్మాన్ని పాటించని సంపదకు విలువ లేదు .

మరి కవి చెప్పినట్టు అనుభవం ఎలా వస్తుంది? చదువులు చదివినంత మాత్రాన అన్నీ తెలియవు. తెలిసిపోవు. కొన్ని అనుభవం మీద తెలుస్తాయి. మరికొన్ని పరిశీలన ద్వారా తెలుసుకునే ప్రయత్నం చెయ్యాలి. అందుకు ఎన్నో మార్గాలున్నాయి.

ఉదాహరణకు – పక్షులు, చెట్లు, పూలు, మేఘాలు, వర్షం - ఇవన్నీ ప్రకృతి నుండి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకునే అవకాశాన్ని కలిగిస్తాయి. చుట్టూ ఉన్న మనుషుల్ని గమనిస్తే వాళ్లెలా మాట్లాడతారో, ఏయే పనులు చేస్తారో, ఎలాంటి అలవాట్లు లేదా అభిరుచులు కలిగి ఉన్నారో, బడిలో ఉపాధ్యాయులెలా పాఠాలు చెబుతారో, బడి దారిలో ఎదురయ్యే కారు, బస్సు , ఆటో మొదలైన వాహనాలెలా తయారయ్యాయో, వాటినెలా సమర్థవంతంగా నడుపుతారో , రోడ్డు ప్రక్కన కూర్చుని అమ్మకం చేసే వర్తకులు కొనుగోలు దారులతో ఎలా మాట్లాడతారో , ఏయే వస్తువులమ్ముతారో , పోస్టాఫీసు లేదా బ్యాంకుల్లో డబ్బెలా జమ చెయ్యాలో మొదలైన విషయాలన్నీ తెలుస్తాయి. ఆయా పనులకు తప్పక చక్కటి అనుభవం ఉండాల్సిందే.

వేసవి సెలవుల్లో రైలు ప్రయాణాలు చేసినట్టయితే , కనబడే ప్రతి దృశ్యాన్ని ఆస్వాదిస్తూ పరిశీలించాలి. ఆ ప్రయాణంలో కొత్త మనుషులు, కొత్త ప్రదేశాలు పరిచయమైతే అలాంటివి భవిష్యత్తులో ఉపయోగపడతాయేమో అన్నట్టు గుర్తు పెట్టుకోవాలి. వీలయితే దైనందిని లో రాసుకోవాలి.

పరిసరాల్లో కనబడే వస్తువుల్ని గమనిస్తే మరికొన్ని కొత్త విషయాలు తెలుస్తాయి. స్కూల్ బ్యాగులో ఉండే పెన్సిల్, పెన్ను, ఎరేజర్, స్కేలు, పుస్తకం మొదలైనవి కూడా కొత్త ఆలోచనలు కలగడానికి ఉపకరిస్తాయి. ఆట బొమ్మలు, సైకిల్, అమ్మ ఇచ్చే టిఫిన్ బాక్సు, రోజూ ధరించే దుస్తులు వంటివి ఎలా తయారయ్యాయో, వాటి వెనుక ఎందరి శ్రమ ఉందో వంటి ఆలోచనలు కలిగితే కూడా ప్రయోజనం ఉంటుంది.

ఏదైనా కొత్త లేదా వింత వస్తువులు చూసినప్పుడు కలిగే సందేహాలు పెద్దవాళ్ళని , ఉపాధ్యాయుల్ని అడిగి తెలుసుకోవాలి. అడగడానికి మొహమాటం పనికిరాదు. అలా అయితే విజ్ఞానం పొందడంలో అభివృద్ధి ఆగిపోతుంది. జవాబు చెప్పి సంశయం తీర్చే వాళ్లు అందుబాటులో లేనప్పుడు అంతర్జాలంలో పరిశీలించి జవాబులు తెలుసుకోవాలి తప్ప అశ్రద్ధ చెయ్యకూడదు.

"పరిశీలన ఉత్తమోత్తమ గురువు" అన్నారు పెద్దలు. నిజమే . పరిశీలనా శక్తి మనుషుల్లోని సృజనాత్మకతను పెంచుతుంది. ఒక ఆలోచన నుండి మరో ఆలోచనని అభివృద్ధి చేస్తుంది. ఆ ఆలోచన ఒక్కోసారి అద్భుతాలను సృష్టించేందుకు దారి తీస్తుంది. తమ ఆలోచనలను పరిశీలనా దృష్టితో మెరుగుపరచుకుని అద్భుతాలు సాధించిన వాళ్ళెందరో ఉన్నారు.

పూర్వ కాలం నుండి గమనించినట్లైతే లియోనార్డో డావిన్సీ, పికాసో, (చిత్రకారులు), థామస్ ఆల్వా ఎడిసన్, న్యూటన్ , గ్రాహంబెల్ (శాస్త్రవేత్తలు) షేక్స్పియర్, మాక్సిమ్ గోర్కీ, రవీంద్రనాథ్ ఠాగూర్ (రచయితలు) శ్రీనివాస రామానుజన్ (గణిత శాస్త్రజ్ఞుడు) , విశ్వనాథ ఆనంద్ ( చదరంగం) సునీల్ గవాస్కర్ , కపిల్ దేవ్, టెండూల్కర్ (క్రికెట్ క్రీడాకారులు) మొదలగు వారి నుండి ఇప్పటి వరకు అనేక విజయాలు సాధించిన వాళ్లున్నారు. ఇతరులకు భిన్నంగా ప్రయత్నించి తమ పరిశీలనా శక్తితో మెదడుకు పదును పెట్టి సృజనాత్మకత రంగరించి కొత్త విజయాలు సాధించారు వాళ్లంతా. మనకు తెలిసిన విషయాన్ని కొత్త కోణంలో ఆలోచించి , ఆచరణలో పెట్టి సమర్థంగా అమలు పరుస్తూ అసాధ్యం అనుకున్న వాటిని సుసాధ్యం చేసిన వారున్నారు లోకంలో. అనేక విషయాలను తమ సునిశిత పరిశీలనా దృష్టితో చూసి గొప్ప విజయాలు సాధించి ప్రపంచ మేధావులుగా పేరు గడించిన వారు కూడా ఉన్నారు .

తాను కరుగుచుగూడ, తగదనక కొవ్వొత్తి/

కాంతినొసగు, ఎంతో కరుణ తోడ/

లోకాన సజ్జనుని పోకడ ఇట్టిది/

మంచిమాట వినర మానవుండ!/

అని ఒక శతక కవి  అన్నట్టు తాను  కరిగిపోతూ లోకానికి వెలుగులు పంచే కొవ్వొత్తిలాగా తమ పరిశీలనా శక్తి ద్వారా మానవజాతికి అద్భుతమైన ఆవిష్కరణలు అందించారు.  వారిలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం  ఒకరు.

ఒక విజేత ఆత్మకథలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం  "తనకు చిన్నప్పటినుంచి ఆకాశపు రహస్యాలన్నా ,  పక్షుల ప్రయాణమన్నా,  అమితమైన ఆసక్తిఅనీ ,   కొంగలూ,  సముద్రపు గువ్వలు ఎగురుతుండటం చూస్తూ వాటిలాగానే ఎగరాలని కోరుకున్నానని, సాధారణ గ్రామీణ బాలుడైనప్పటికీ ఆకాశంలో విహరించగలనని ఎంతగానో  నమ్మాననీ , రామేశ్వరం నుంచి ఆకాశయానం చేసిన మొదటి బాలుడు కావడం పెద్ద  విశేషమని"  రాసుకున్నారు. పరిశీలనాశక్తి ఆయనలో ఎంత ఎక్కువ ఉండేదో , జీవితంలో ఎదగడానికి ఆయనకెంత  ఉపయోగపడిందో దాన్ని బట్టి తెలుస్తుంది.ఆ  రంగంలో రాణించడానికి ఆయన  ఎంతగానో కృషి చేసి దేశ ప్రయోజనాలను కాపాడారని , దేశ ఖ్యాతిని పెంచారని మనకు తెలిసిందే .

పరిశీలనము చేత పండురాలిననాడు /
"న్యూట"నాకర్షణ నుడివెగాదె !/
పరిశీలనము చేత పలువిధ గ్రహముల /
"కోపర్ని"కస్ తెల్పె గురుతుగాను !/
పరిశీలనము చేత పావురాలను బోలు/
సు"విమాన""రైటు"లు సూత్ర మిచ్చె! /
పరిశీలనము చేత పలుపుండ్లు మాన్పెడి /
"పెన్సిలిన్"మందుయే పెన్నిధయ్యె!/
తే.గీ.
కాన పరిశీలనమ్మొక కాన్కగాదె /
కనక రాశుల నందించు గాన నీకు /
నిశిత పరిశీలనమ్మును నిలుపు కొనుము /
క్రొత్త మార్గమ్ములను పొంద గోరియున్న/

అని కవి దానా గారన్నట్టు చరిత్రలో ఎందరో శాస్త్రవేత్తలు, పరిశోధకులు  తమ పరిశీలనా శక్తి ద్వారా మానవజాతికి అద్భుతమైన ఆవిష్కరణలు అందించారు.

ఐజాక్ న్యూటన్ ఒక చెట్టు కింద కూర్చుని ఉండగా ఒక ఆపిల్ రాలి పడటం చూశాడు. సాధారణంగా ఎవరైనా ఆపిల్ పడగానే దాన్ని తిని, ఆకలి తీర్చుకుంటారు. కానీ న్యూటన్ అలా చేయలేదు. " చెట్టు మీదున్న ఆపిల్ కిందకే ఎందుకు పడింది? పైకి ఎందుకు వెళ్ళలేదు?" అని ఆలోచించాడు. అతడిలో మొదలైన పరిశీలన, ఆపై ఎన్నో ప్రశ్నలు రేకెత్తించింది. అనేక పరిశోధనలకు దారి తీసింది. ఫలితంగా గురుత్వాకర్షణ సిద్ధాంతం వెలుగు చూసింది. ఇది ప్రపంచాన్ని అర్థం చేసుకునే విధానాన్ని మార్చివేసింది.

తెలియునే యీనేల తిరుగునం చైరోపి - యనుల గొబర్నికసునకు మున్ను/

ఒకదానినొకటి యీడ్చుకొను పోడిమియున్న - దని చదివిరె న్యూటనునకు మున్ను/

ఎరుగుదురే తపాల్ మెరుగు వేగిరమున - నడచునంచును హూకునకును మున్ను/

కనుగొనిరే త్రెడ్డుగాలి లేకనె యోడ - చనునంచు జేమ్సువాటునకు మున్ను/

గీ. తెలిసినది తక్కలేదని తలఁచరాదు - క్రొత్తలింకను దెలియగాఁ గోరవలయు/

అని పలుకు దాసురాముడి ట్లచ్చ తెనుగు - కబ్బ మందమునిండఁ జక్కట్లదండ /

అని శతక కర్త దాసురాముడు చెప్పినట్లు కొంత మంది శాస్త్రవేత్తల పరిశోధనలు కారణంగానే లోకానికి అనేక నూతన ఆవిష్కరణలు అందాయి. అలాంటి వాటిలో కొందరి గురించి తెలుసుకుందాం.

జేమ్స్ వాట్ ఒకరోజు ఒక కెటిల్ నుండి నీటి ఆవిరి పైకి లేవడాన్ని గమనించాడు. ఆ ఆవిరి ఎంత శక్తివంతంగా ఉందో గ్రహించాడు. ఈ పరిశీలన నుండే ఆవిరి యంత్రం ఆవిష్కరణకు బీజం పడింది. ఇది పారిశ్రామిక విప్లవానికి దారి తీసింది. ప్రపంచంలోని రవాణాను, పరిశ్రమలను పూర్తిగా మార్చేసింది.

అలెగ్జాండర్ ఫ్లెమింగ్ ఒకసారి తన ప్రయోగశాలలో కొన్ని ప్లేట్లలో బ్యాక్టీరియాను పెంచాడు. అనుకోకుండా ఒక ప్లేట్‌పై బూజు **(Fungus)** పెరిగింది. ఆయన ఆ బూజు చుట్టూ ఉన్న ప్రాంతంలో బ్యాక్టీరియా చనిపోవడాన్ని గమనించాడు. సాధారణంగా ఆలోచించే వేరెవరైనా అయితే ఆ ప్లేట్‌ను పారేసేవారు. కానీ ఫ్లెమింగ్ దానిని నిశితంగా పరిశీలించి, ఆ బూజుకు బ్యాక్టీరియాను చంపే శక్తి ఉందని కనుగొన్నాడు. అది పెన్సిలిన్ అనే మొదటి యాంటీబయాటిక్‌కు కనుగోడానికి దారి తీసింది. ఈ ఆవిష్కరణ లక్షలాది మంది ప్రాణాలను కాపాడింది.

మన దైనందిన జీవితంలో, ఇతరులతో కలసి తిరిగేటప్పుడు , మెలిగే టప్పుడు కూడా పరిశీలనా శక్తి ఉపయోగపడుతుంది. ఇతరుల భావాలను అర్థం చేసుకోవడానికి, స్నేహితుల మనోభావాలు గ్రహించి సమస్యలో ఉన్నట్టయితే సాయపడడానికి , స్నేహ సంబంధాలను మెరుగు పరుచుకోడానికి సహాయపడుతుంది.

“ప్రపంచంలో పనికి రాని వస్తువంటూ ఏదీ లేదని” పెద్దలన్నట్టుగా , ఇంట్లో ఉన్న పాత వస్తువులను, పాడైన వస్తువులను జాగ్రత్తగా పరిశీలిస్తే వాటిని పారెయ్యకుండా మరొక కొత్త రూపంలోకి మార్చుకుని వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. పాత బకెట్లు , పాత టైర్లతో పూలకుండీలు

చేయవచ్చు. పాత ప్లాస్టిక్ సీసాలతో పెన్ స్టాండ్‌లు తయారు చేయవచ్చు. ఇది సృజనాత్మకతకు, వృథాను తగ్గించడానికి దారి తీస్తుంది.

పాఠశాలకు వెళ్లే దారిలో గతుకులు ఏర్పడి నడవడానికి ఇబ్బంది కలుగుతున్నా , గోతుల్లో నీరు నిలిచిపోయి, ప్రయాణం ప్రమాదకరంగా మారినట్టనిపించినా వాటిని సరిచేసే ప్రయత్నం చెయ్యాలి. ఆ మార్గంలో వెళ్లే మరెందరికో సహాయం చేసినట్టు అవుతుంది. ఇటువంటి పరిశీలనలు సమాజంలో పెద్ద మార్పులకు దారితీస్తాయి.

క్రొత్తపని యొక్కటొనరింప గోరెదేని - క్రొత్తలొక మరికొన్నిటి గూర్పవలయు/

అని పలుకు దాసురాముడి ట్లచ్చ తెనుగు - కబ్బ మందమునిండఁ జక్కట్లదండ/

అంటారు శతక కర్త దాసురాముడు. దాని భావమేమంటే – ఒక కొత్త పనిని చేయాలని కోరుకుంటే, దానికి కొన్ని కొత్త అంశాలను చేర్చాలి. ఈ పద్యంలోని భావం నేటి ఆధునిక ప్రపంచంలో అత్యంత ఆచరణీయం. ఏదైనా కొత్తగా చేయాలంటే, కేవలం పాత వాటిని పునరావృతం చేస్తే సరిపోదు. దానికి కొత్త ఆలోచనలు, కొత్త విధానాలు, కొత్త కోణాలు జోడించాలి. ఇది వ్యక్తిగత అభివృద్ధికి, వృత్తిపరమైన పురోగతికి కీలకం. సృజనాత్మకత అంటే శూన్యం నుండి ఏదో ఒకదాన్ని సృష్టించడం కాదు. ఇప్పటికే ఉన్న వాటికి కొత్తదనాన్ని, వినూత్నతను జోడించడమే. ఒక కళాకారుడు యొక్క కొత్త చిత్రమైనా, ఒక శాస్త్రవేత్త యొక్క కొత్త ఆవిష్కరణ అయినా, ఒక వ్యాపారవేత్త యొక్క కొత్త వ్యూహమైనా – వీటన్నింటికీ ఈ సూత్రమే ఆధారం. జీవితంలో గానీ, పనిలో గానీ స్థిరంగా ఉండాలనుకోవడం మార్పును నిరాకరించడమే అవుతుంది. ఏదైనా కొత్తదనం రావాలంటే, కొన్ని కొత్త విషయాలను స్వాగతించాలి, వాటిని చేర్చుకోవాలి. ఇది పురోగమనానికి అనివార్యం. కొత్త విషయాలను చేర్చాలంటే కొన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి రావచ్చు. కానీ ఈ సవాళ్లే మనల్ని మెరుగుపరుస్తాయి, మన సామర్థ్యాలను పెంచుతాయి.

పై పద్యంలోని కవి భావాన్ని బలపరిచినట్టు ఆధునిక ప్రపంచంలో, పరిశీలనా శక్తితో అనేక కొత్త ఆవిష్కరణలు జరిగాయి. సమస్యల పరిష్కారానికి నిరంతరం తోడ్పడుతున్నాయి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి కృత్రిమ మేధస్సు అభివృద్ధి వెనుక కూడా మనుషులు ఆలోచనా విధానం , పరిశీలనా శక్తితో తీసుకునే నిర్ణయాలు ఉంటున్నాయి. ఏయే సందర్భానికి ఎలా వ్యవహరిస్తున్నారనే వాటిని నిశితంగా పరిశీలించి, కంప్యూటర్లలో ప్రోగ్రామ్ చేయడం ద్వారా అవన్నీ సాధ్యమయ్యాయి. గూగుల్ అసిస్టెంట్ నుండి స్వీయ-డ్రైవింగ్ కార్ల వరకు అనేక సాంకేతిక అభివృద్ధికి మానవ పరిశీలనలు, పరిశోధనలే కారణమయ్యాయి.

శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో జరుగుతున్న మార్పుల్ని (ఉష్ణోగ్రత పెరగడం, వర్షపాతంలో మార్పులు, మంచు కరగడం) నిరంతరం పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగానే వాతావరణ మార్పుల ప్రభావాలను, వాటిని తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యల్ని అంచనా వేయగలుగుతున్నారు.

నేర పరిశోధనలో భాగంగా అనేక కేసుల్లోని నిజాలు నిగ్గు తేల్చేందుకు పోలీసులు, డిటెక్టివ్ లు మరియు న్యాయ విభాగం అధికారులు తమ పరిశీలనా శక్తితోనే వాస్తవాలు పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకుంటారు . అసలైన దోషులు, నేరస్తుల్ని పట్టుకుంటారు. తగినట్టు శిక్షిస్తారు.

అప్పటికే ఉన్న వాటికి మెరుగైన రూపం ఇవ్వడం ద్వారా కొన్ని , నూతన తరానికి సరిపడే ఆలోచనలతో మరికొన్ని ఆవిష్కరణలు చేస్తూ విజ్ఞానపథంలో ముందుకు దూసుకువెళుతున్నారు.

ఇక డాక్టర్ల విషయానికి వస్తే రోగుల లక్షణాల్ని, వ్యాధి పురోగతిని చాలా శ్రద్ధగా పరిశీలిస్తారు. దాని ఆధారంగానే రోగ నిర్ధారణ చేస్తారు. చికిత్సా ప్రణాళికలు రూపొందిస్తారు. నూతన ఔషధాలు ఆవిష్కరణ, వ్యాధుల కట్టడికి సంబంధించిన పరిశోధనలన్నీ నిశితమైన పరిశీలన ద్వారా సాధ్యమవుతాయి. కరోనా టీకా **(COVID-19 Vaccine)** అభివృద్ధి అనేది శాస్త్రవేత్తలు వైరస్ ప్రవర్తనను వేగంగా పరిశీలించి, అర్థం చేసుకోవడం వల్ల వచ్చిన ఒక గొప్ప విజయం. ప్రపంచ మానవాళి కెంతో మేలు చేసింది .

నిత్య జీవితంలో మనుషులు ఉపయోగించే మొబైల్ యాప్‌లు, వెబ్‌సైట్‌లు అన్నీ వినియోగదారుల అవసరాలను, ఉపయోగించే విధానాన్ని పరిశీలించడం ద్వారా అభివృద్ధి చేయబడినవే . **"**ఈ యాప్ ఇంకెలా అభివృద్ధి చేస్తే మరింత మెరుగైన ఫలితాలు ఇస్తుంది**?", "**వినియోగదారులకు అందుబాటులో ఉండేందుకు మరింత సులభంగా ఎలా మార్చాలి**?"** వంటి అనే ప్రశ్నలు పరిశీలనల నుంచి వస్తాయి.

చదువు జదువకున్న సౌఖ్యంబులును లేవు/
చదువు జదివెనేని సరసుడగును/
చదువు మర్మమెరిగి చదువగ చూడుము/
విశ్వదాభిరామ! వినుర వేమ!/

అన్నారు కవి వేమన.

చదువు లేనివారికి సౌఖ్యం లభించదు. చదువుకున్నవాడే సజ్జనుడు. చదువుకోవాలనే అభిలాష కలవాడు విద్యలలోని సారాన్ని, మర్మాన్ని గ్రహించడానికి చదవాలి గాని వృథా పఠనం వల్ల ప్రయోజనం లేదు అని ఆయన చెప్పిన పద్యం యొక్క భావం.

చదువులోని సారం, మర్మం తెలుసుకోవడం కోసమే చదవమని బోధించాడు. పై పై చదువులతో పొద్దు పుచ్చకుండా లోపలి సారాన్ని గ్రహించేలా పరిశీలనా శక్తిని పెంచుకోమని చెప్పాడు.

అటువంటి నిశిత పరిశీలనల కారణంగానే విజయాలు సాధించిన వ్యక్తులున్నారు. దక్షిణాఫ్రికా, భారతదేశాల్లో ప్రజల పరిస్థితుల్ని, బ్రిటిష్ పాలనా విధానాల్ని నిశితంగా గమనించి, సరిగ్గా అన్వయించి, అహింస, సత్యాగ్రహ మార్గాలను రూపొందించారు మహాత్మా గాంధీ. దేశ కాలమాన పరిస్థితులు , ప్రజల

ఇబ్బందులు గ్రహించడం వల్లనే ఇటు ప్రజలను అటు బ్రిటీషు పాలకులను ప్రభావితం చేయగలిగారు. స్వాతంత్ర్య ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించగలిగారు.

జీవితంలో ఉన్న దుఃఖాన్ని, సమాజంలో ఉన్న అసమానతలను గౌతమ బుద్ధుడు పరిశీలించబట్టే మధ్య మార్గాన్ని కనుగొన్నాడు. బౌద్ధమతాన్ని స్థాపించాడు.

మౌర్య సామ్రాజ్య స్థాపన సమయంలో చుట్టూ ఉన్న రాజకీయ పరిస్థితులను, శత్రువుల బలాబలాలను నిశితంగా గమనించిన చాణక్యుడు . అందుకు తగ్గట్టే వ్యూహాలు రచించి చంద్రగుప్తునికి విజయాన్ని అందించాడు.

చాణక్యుడు చూపిన బాటలోనే అనేక మంది రాజులు, వారి మంత్రులు తమ పరిసరాలను, ప్రజల అవసరాలను, శత్రువుల వ్యూహాలను నిశితంగా గమనించి నిర్ణయాలు తీసుకుని లాభం పొందారని చరిత్ర తెలిపింది .

పాలు మంచివియైన బాసెంబు మంచిది - గాలి మంచిదియైన గాఋ మంచి/

పోగు మంచిదియైన బుట్టంబు మంచిది - పొదుగు మంచిదియైన మొదవు మంచి/

బసిడి మంచిదియైన బట్టెడ మంచిది - నీరు మంచిదియైన నేరు మంచి/

మాట మంచిదియైన మరియాద మంచిది - యూటె మంచిదియైన బోటు మంచి/

మంచిగోరిన వాడెప్డు మంచిదైన - పని యొనర్పక యూఱ కేర్పడదు మంచి/

అని పలుకు దాసురాముడి ట్లచ్చ తెనుగు - కబ్బ మందమునిండఁ జక్కట్లదండ/

అన్నారు శతక కవి దాసురాముడు. మంచి పాలను నిల్వ చేయడానికి బిందె మంచిది. అలాగే గాలి మంచిదే అయినా, అది ప్రవహించేది గాటుగా (దారి/గది) ఉండాలి. అంటే గాలి చక్కగా తాకాలని భావన. పొగ మంచిదే అయినా, అది పోయే బుట్ట/బొయ్యి (వెంటిలేటర్) మంచిది కావాలి. అలాగే పొదుగు మంచిదే అయినా, దాన్ని తొలగించే మొదవు (వెచ్చని నీటితో స్నానం చేయడం వంటిది) మంచిదిగా ఉండాలి. బాసిడిని (వంటగదిలో చల్లిన పదార్థం) పెట్టే పాత్ర బుట్ట మంచిది. నీరు మంచిదే అయినా, అది సాగే దారి (నేరువు) కూడా మంచిదిగా ఉండాలి. మాట మంచిదే అయినా, దానితో పాటు మర్యాద కూడా ఉండాలి. అలాగే ఈటె (ఘనమైన పదార్థం/రాయి) మంచిదే అయినా, దాన్ని మోసే నౌక మంచిదై ఉండాలి. మంచి కోరే వాడు ఎప్పుడూ మంచివాడే. కానీ పనిని ఆచరణలో పెట్టకపోతే, ఊరుకున్నా అది ఫలించదు. మనం మాట్లాడే మంచి మాటలు కార్యరూపంలో లేకపోతే ప్రయోజనం లేదని కవి భావం.

నిజమే. శాస్త్ర విజ్ఞానము లేదా మరేదైనా జ్ఞానమైనా వ్యక్తుల్లో ఉంటే సరిపోదు. వారు మేధావులైనంత మాత్రాన ప్రయోజనం లేదు. వాళ్ళ జ్ఞానంతో లోకోపకారం జరిగినప్పుడే ప్రయోజనం. అలా తన జ్ఞానంతో మేలు కలిగించిన గొప్ప వ్యక్తి గురించి తెలుసుకుందాం.

అత్యంత చైతన్యవంతమైన, విజ్ఞానవంతమైన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారని లోకానికి తెలుసు. ఆయన పరిశీలనా శక్తినతో పెద్ద ప్రమాదాన్ని తప్పించిన సంఘటన తెలుసుకుందాం.

ఆయనొకసారి రైలులో ప్రయాణిస్తున్నారు. ఆ సమయంలో రైలు ఒక పెద్ద నది మీద వంతెన దాటుతోంది. రైలు చక్రాల నుండి వచ్చే ధ్వనిలో తేడా ఉన్నట్టు పసిగట్టారాయన. తనకున్న ఇంజనీరింగ్ పరిజ్ఞానంతో వంతెన నిర్మాణాన్ని అంచనా వేశారు. ఆ వంతెనలో ఒక చోట ఖచ్చితంగా ఒక దోషం ఉందని అనుమానించారు. కొన్నిచోట్ల పట్టాలు సరిగ్గా అమర్చబడలేదని, లేక స్ట్రక్చర్ లో సమస్య ఉందని గుర్తించారు.

వెంటనే లైట్మన్‌ను, గార్డుని సంప్రదించి, రైలును ఆపించారు. మొదట్లో ఆయన మాటల్ని వారు నమ్మలేదు. కానీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి పేరు విన్న తరువాత ఆయనకున్న ఇంజనీరింగ్ పరిజ్ఞానంతో రైలు ఆపించారని తెలుసుకుని ఆ వంతెనని అధికారులు పరిశీలించారు. నిజంగా ఆ బ్రిడ్జ్ లో ఓ చిన్న లోపం ఉన్నదని తేలింది. దీని వల్ల ఒక పెద్ద ప్రమాదం తప్పిందని చెబుతారు. ఒకవేళ రైలు ప్రమాదం జరిగి ఉంటే ఎంత నష్టం జరిగేదో ఊహించగలమా?

భారతదేశంలో తొలి సివిల్ ఇంజనీర్లలో ఒకరు, మైసూర్ రాజ్యంలో చెన్నపట్న డ్రైనేజ్ సిస్టం, కృష్ణరాజ సాగర్ డామ్ వంటి పెద్దపెద్ద ప్రాజెక్టుల పాలకుడు, **1955** లో భారత రత్న పొందిన మొదటి ఇంజనీర్ అయిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి పరిశీలనా శక్తికి ఇదొక గొప్ప ఉదాహరణగా నిలిచింది.

నిశిత పరిశీలన వల్ల ప్రయోజనం పొందిన సంఘటనలు పురాణాల్లో కూడ కనిపిస్తాయి. సీతమ్మ జాడ వెదుకుతూ లంకలో ప్రవేశించిన హనుమంతుడు అక్కడి పరిస్థితులను, రాక్షసుల సంచారాన్ని, సీతమ్మను ఎక్కడ వెతకాలో నిశితంగా గమనించడం వల్లనే ఆ పనిలో విజయం సాధించాడు. చివరకు అశోకవనంలో ఆమెను కనిపెట్టాడు.

అలాగే ప్రస్తుత కాలంలో ఉద్యోగార్థులకు పరిశీలన అవసరం ఎంతో ఉంది. ఉద్యోగంలో చేరబోయే సంస్థల గురించి , విధివిధానాల గురించి తగు పరిశీలన , పరిశోధన చేసినట్లైతే సంస్థ తరపున ఇంటర్వ్యూ చేసే అధికారులను మెప్పించి విజయులై వచ్చే అవకాశాలు మెరుగవుతాయి.

నిమిష నిమిషానికీ లోకసమరమందు /

దూసుకొనువచ్చు విపరీత దుష్ట శక్తు/

లెల్ల తరుమగ విజ్ఞాన మెల్ల జదివి /

వసుధ రక్షింప బూనుము బాలకుండ!/

అంటారు కవి దానా . నిజజీవితంలో పొంచి ఉన్న ఆపదలనే దుష్టశక్తుల నుండి తప్పించుకోవడానికి విజ్ఞానవంతుడిపై తెలివిగా ఆలోచించి , విజ్ఞతతో పరిశీలించాలని, జగతిని రక్షించుకోవాలని పద్యకవి బోధించారు.

అంతేకాదు మరో కవి తన  గువ్వల చెన్నా శతకంలో కూడా విషయం యొక్క లోతు తెలుసుకోవాలని చెప్పారు. అది తెలిసేది కేవలం సునిశిత పరిశీలన వల్లనే కదా . ఆ పద్యాన్ని పద్యం యొక్క భావాన్ని చదువుదాం.

**సారాసారము లెఱుఁగని బేరజులకు బుద్ధిఁజెప్పఁ బెద్దలవశమా?/**

**నీరెంత పోసి పెంచినఁ గూరగునా నేలవేము?గువ్వలచెన్నా! /**

**సారాంశం ఏమిటంటే, మంచి చెడు, లేదా విషయం యొక్క లోతు తెలియని వారికి, పెద్దలు ఎంత చెప్పినా, బుద్ధి నేర్పడం కష్టమే. ఇది ఎంత కష్టమో వివరించడానికి ఒక పోలిక చెప్పారు. నీరు ఎంత  పోసి పెంచినా, నేలవేము (చిరాయిత, ఒక రకమైన చేదు మొక్క) ఎప్పటికీ తీపిగా మారదు.  అది చేదుగానే ఉంటుంది. అదేవిధంగా, సహజంగానే మూర్ఖులైన వారికి లేదా విషయం గ్రహించలేని వారికి ఎంత బోధించినా ప్రయోజనం ఉండదు అని ఈ పద్యం యొక్క భావం.** నిజమే కదా I మూర్ఖులుగా ఉండటం కంటే పరిశీలనా శక్తితో తెలివిని పెంచుకోవడం ఉత్తమం.

మానవులు  ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి మంచి చెడులను విశ్లేషించుకుని ముందడుగేయాలి. అప్పుడే  వ్యక్తిగత ప్రయోజనంతో బాటు సమాజ హితం చేకూర్చిన వాళ్లవుతారు.   అయితే పరిశీలనా శక్తిని ఎలా పెంచుకోవాలో తెలిపే కొన్ని సూత్రాలను తెలుసుకుందాం.

**ముందుగా ప్రశ్నించే అలవాటు పెంచుకోవడంతోనే పరిశీలనా శక్తి అలవడుతుంది.  ఏదైనా విషయాన్ని చూస్తూ " ఎందుకు, ఏమిటి, ఎలా ?" అని ప్రశ్నించాలి. ఇలా ప్రశ్నించడం ద్వారా లోతైన అవగాహన పెరుగుతుంది.**

**దానికి తోడు నిరంతర స్వీయ-పరిశీలన అవసరం.  మన ఆలోచనలు, చర్యలు, భావోద్వేగాలను తరచూ విశ్లేషించుకోవాలి.  తత్వవేత్త  జిడ్డు క్రిష్ణమూర్తి చెప్పినట్టు, మనం చేసే ప్రతి దానిపై ఎంపిక లేని జాగ్రత్త అవసరం. ఇది నిజమైన పరిశీలనకు మార్గం అవుతుంది.**

**పై రెండింటికి  సృజనాత్మక ఆలోచనలు తోడవ్వాలి. అప్పుడే  సాధారణ విషయాల్ని కొత్త కోణంలో పరిశీలించ గలుగుతారు. పరిశీలనలో లోతు పెరుగుతుంది.**

**నాలుగవ అంశం  పరిసరాలపై దృష్టి పెట్టడం. చుట్టూ ఉన్న పరిసరాలను గమనిస్తుండాలి. అవి చిన్న విషయాలే అయినా ఒక్కోసారి పెద్ద పెద్ద  మార్పులకు కారణమౌతాయని తెలుసుకోవడం ముఖ్యం.**

**ఐదవది  నిరంతర అభ్యాసం చేయడం.  ప్రతిరోజూ చిన్న విషయాన్నైనా పరిశీలన దృష్టితో చూడడం మొదలుపెట్టాలి. అదొక  అలవాటుగా మారుతుంది. తగిన ప్రయోజనాన్ని అందిస్తుంది.**

**ధ్యానం, యోగ వంటి  పద్ధతులు అవలంబించడం ద్వారా  స్పృహ (mindfulness), జ్ఞానం, ఏకాగ్రత వంటి అంశాలు అభివృద్ధి చెందుతాయి. పరిశీలనా  దృష్టి మెరుగుపడుతుంది.**

పరిశీలన అనేది చూడటం మాత్రమే కాదని, ఆలోచించడం, విశ్లేషించడం, అన్వయించడం కూడా అని తెలుసుకుని పై సూత్రాలను అనుసరిస్తే పరిశీలనా దృష్టి మెరుగు పడుతుందనడంలో సందేహం లేదు.

తన్ను తాను ముందు తెలుసుకొని పిమ్మట/

పరులకుపదేశించుటెల్ల లెస్స/

తాను గ్రుడ్డియైన దారెట్లు జూపును?/

మంచి మాట వినర మానవుండ!/

అని భమిడిపాటి కామేశ్వరమ్మ గారు 'మంచి మాట వినుర మానవుండ' శతకంలో రాసినట్టు ముందు మన పరిశీలనా శక్తిని పెంచుకుని ఎదగాలి . తరువాత సమాజానికి దిశానిర్దేశం చేసే స్థాయిని సంపాదించాలి.

పిల్లలూ... ఇంతవరకు చర్చించిన విషయాలను అవగాహన చేసుకుని, పరిశీలనా శక్తిని పెంచుకుని తగు ప్రయోజనాలు పొందుతారు కదూ।

——-******---------.